www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11.24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2.21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48; దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00; అమృతఘడియలు: ఉ.6.15-7.44, తె 3.36-5.06; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.31

రంగారెడ్డి జిల్లా

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కార్మికుల బతుకులు దుర్భరమే..

- చట్టాల అమలుకు యాజమాన్యాల తిలోదకాలు
- పని ప్రదేశాల్లో కనిపించని సేఫ్టీ ప్రికాషన్స్
- పట్టించుకోని కార్మిక శాఖ అధికారులు
- ఆగని కార్మికుల శ్రమదోపిడీ!
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



రాత్రింబవళ్లు యంత్రాల మధ్య పనిచేస్తూ ప్రజలకు వినియోగ వస్తువులను తయారు చేస్తున్న కార్మికుల బతుకులు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రతీ సంవత్సరం ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే)ను జరుపుకుంటున్నా.. వారి జీవితాల్లో మార్పు కనిపించడం లేదు. కనీస వేతనాలు ఉండవు.. సౌకర్యాలు, భద్రత కనిపించదు.. ఏళ్లకేళ్లుగా కార్మికుల శ్రమదోపిడీ జరుగుతూనే ఉంది. నేడు మేడే సందర్భంగా ప్రత్యేకం..

3



బాబూజీ వనంలో గోవులకు మేత తినిపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

నిశ్శబ్దం ఒక అరుదైన విలాసం

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

షాద్‌నగర్/హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శబ్దకల్లోల ప్రపంచంలో నిశ్శబ్దం అరుదైన విలాసమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో జరుగుతున్న పూజ్య బాబూజీ మహారాజ్ 125 జయంతి ముగింపు కార్యక్రమానికి బుధవారం హాజరై బాబూజీ వనాన్ని ప్రారంభించారు. పవిత్రమైన అక్షయ తృతీయ రోజు బాబూజీ మహారాజ్ జయంతి వేడుకలు జరుపుకోవడం గొప్ప ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా పవిత్ర తీర్థంకరులు, ప్రేమ యొక్క సింఫనీ అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో 50 వేల మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే వీర్లపల్లి

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం

» కలెక్టర్ నారాయణరెడ్డి

చౌదరిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. జిల్లాలో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద కొందుర్గు మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ధరణితో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, రైతుల కష్టాలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో సరిత, ఏడీఏ రాజరత్నం, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదిలో 31వ స్థానం

ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈసారి గ్రేడింగ్ స్థానంలో మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్‌లను ఇచ్చారు. కొత్త మెమో నమూనాను విద్యాశాఖ విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 51,671 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, అందులో 45,386 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 87.84 నమోదైంది. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా ఫలితాల్లో 31వ స్థానంలో నిలువగా, ఫలితాల్లో ఈసారి కూడా బాలుర కంటే బాలికలే సత్తా చాటారు.

- గతేడాది కంటే తగ్గిన ఫలితాలు
- ఈసారి కూడా అమ్మాయిలదే హవా
- బాలికలు 89.65, బాలురు 86.18 శాతం ఉత్తీర్ణత
- 18 పాఠశాలల్లో వంద శాతం పాస్
- ప్రతిభ చాటిన ప్రభుత్వ విద్యార్థులు

జిల్లాలో 87.84 శాతం ఉత్తీర్ణత

విద్యార్థులు	51,671
ఉత్తీర్ణత	45,386
ఉత్తీర్ణత శాతం	87.84

పాఠశాలల వారీగా..

మేనేజ్‌మెంట్	ఉత్తీర్ణత శాతం
జడ్పీ	71.65
గవర్నమెంట్	65.31
మోడల్	84.80
కేజీబీవీ	75.00
ఎయిడెడ్	87.18
ఆశ్రమ	76.60
బీసీ-వెల్ఫేర్	95.24
ప్రైవేట్	93.14
ఆర్ఈఐఎస్ ఎంఐఎన్	91.87
ఎస్‌డబ్ల్యూఆర్	94.97
టీడబ్ల్యూఆర్	93.68



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గతేడాది కంటే ఈసారి 3.17 శాతం ఉత్తీర్ణత తగ్గింది. మొత్తం 51,671 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 45,386 ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 50,811 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 46,245 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది జిల్లాలో 91.01 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈసారి 87.84 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

బాలికలదే పైచేయి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. 27,013 మంది బాలురు పదో తరగతి పరీక్షలు రాయగా అందులో 23,281 మంది పాసయ్యారు. అలాగే 24,658 మంది బాలికలు పరీక్షలు

మిగతా 4వ పేజీలో...



ఐ.నిఖిల్(580/600) ఇబ్రహీంపట్నం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల



కె.శ్రావణి, (579/600), సోషల్ వెల్ఫేర్, ఆమనగల్లు



నిష్మిక (578/600) కమ్మదనం గురుకుల పాఠశాల, షాద్‌నగర్



కె.పూజ (574/600) ప్రభుత్వ పాఠశాల, పెద్దషాపూర్



జాన విఘ్నేశ్ (574/600), ఉన్నత పాఠశాల, నాగన్‌పల్లి



సంపూర్తి (570/600) మోడల్ స్కూల్, ఆరుట్ల

ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి

» డీఆర్‌డీవో పీడీ శ్రీలత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ ఇంకుడు గుంత తవ్వుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్య కమిటీ రెండో సమావేశాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యక్తిగత, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మించుకునేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. డీపీవో సురేశ్‌మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం, తడి, పొడి చెత్త నిర్వహణకు స్వచ్ఛభారత్ మిషన్ కింద కల్పిస్తున్నన సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలను ఆదేశించారు.



గొప్ప నాయకుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి

ఎంపీ ఈటల రాజేందర్ 2



మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు

డీఆర్‌వో సంగీత 3

పదవుల పందేరం!

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పదవుల పందేరానికి రంగం సిద్ధం చేసింది. దీంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. వారు పార్టీలోని అన్ని స్థాయిల నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే బ్లాక్, మండల కమిటీల ఎంపిక పూర్తి చేయనున్నారు. కాగా, మండల, బ్లాక్, జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో భారీ పోటీ నెలకొంది.

కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి

- బ్లాక్, మండల, డీసీసీ అధ్యక్ష పదవులకు పోటీ.. జిల్లా అధ్యక్ష పీఠంపై సీనియర్ల కన్ను..
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేతలు.. 2017 నుంచి ఉన్న వారికే దక్కనున్న ప్రాధాన్యం
- సీనియర్లతో పాటు మహిళలు, యువతకు పెద్దపీట.. ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పదవుల కోలాహలం





రంగారెడ్డి అర్బన్/తాండూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు సీహెచ్ శివసేనారెడ్డి, సంతోష్ కుమార్ కోల్‌కొండ, దారసింగ్, వికారాబాద్ జిల్లాకు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, రాంసెట్టి నరేందర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు సీహెచ్ పారిజాత నర్సింహారెడ్డి, కొత్తకుర్మ శివకుమార్‌ను పరిశీలకులుగా నియమించింది. వీరు జిల్లా స్థాయి సమావేశాలను పర్యవేక్షించనున్నారు. త్వరలోనే బ్లాక్ కాంగ్రెస్, మండల స్థాయి అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు. అలాగే మే 4 నుంచి 10వ తేదీ వరకు మండల కమిటీల ఏర్పాటు, మే 13 నుంచి 20 వరకు గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు.

డీసీసీ పీఠంపై ఆసక్తి

కాగా, మండల, బ్లాక్ జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే ఆసక్తి క్యాడర్‌లో నెలకొంది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొనడంతో అందరి దృష్టి డీసీసీపై పడింది. దీంతో కొందరు సీనియర్ నేతలు తమ అనుచరులను డీసీసీ పీఠాలపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో అనేక

మిగతా 3వ పేజీలో...

సమీకరణాలు, సమర్థతే గీటురాయి

ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత అభిప్రాయాలను పరిశీలకులు సేకరించి జాబితాను వడపోస్తారు. చివరికి తుది జాబితాను పీసీసీకి నివేదించనున్నారు. సామాజిక సమీకరణలు, నాయకుల సమర్థత, సీనియార్టీ, నియోజకవర్గాలు, ఆయా బ్లాక్, జిల్లాలో పరిస్థితులు, పార్టీ బలలోపేతానికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పదవులను భర్తీ చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాలోని ముఖ్య నాయకులు పదవులు దక్కించుకునేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి మొదలైంది.



గాలివానకు కూలిపోయిన సొరకాయ పందిరి

గాలివాన బీభత్సం

ఆమనగల్లు/మాడ్గుల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో బుధవారం వడగండ్ల వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి రైతుల పంటలకు నష్టం వాటిల్లింది. మాడ్గుల మండలం చంద్రయన్‌పల్లి గ్రామంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన రైతు కసిరెడ్డి పురుషోత్తం రెడ్డికి చెందిన సొరకాయ తోట పూర్తిగా దెబ్బతిన్నది. గాలివానకు తోటకు వేసిన పందిరి కూలిపోయింది. తోట మొత్తం దెబ్బతినడంతో దాదాపు రూ.3 లక్షల నష్టం జరిగినట్లు రైతు పురుషోత్తంరెడ్డి వాపోయారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకున్నాడు. పలువురు రైతులకు చెందిన మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

ఎరువులు, విత్తనాలు
అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు



ఫర్టిలైజర్ దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

చేవెళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు హెచ్చరించారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌కు ముందుగానే ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు సైతం తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఏవో సురేష్‌బాబు ఉన్నారు.

గొప్ప నాయకుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మహేశ్వరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాస్వామ్య విలువలను కాపాడిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మండల పరిధి నాగారంలో గల ఓ ఫామ్‌హౌస్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అధ్యక్షతన నిర్వహించిన వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. వాజ్‌పేయి నైతిక విలువలకు కట్టుబడి ప్రభుత్వాన్ని తృణప్రాయంగా వదలుకొని, మళ్లీ ఎన్నికల్లోకి వెళ్లి గెలిచి ప్రధాని అయ్యారన్నారు. 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన'తో గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టారని, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతీ ఒక్కరు వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, జయప్రకాశ్, కాశీనాథ్, నళిని, ప్రేమ్‌రాజ్, నర్సింహారెడ్డి, శ్రీరాములుయాదవ్, అంజన్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌శర్మ, పాపయ్యగౌడ్ పాల్గొన్నారు.

రాజ్యమేలుతున్న రాజ్యాంగేతర శక్తులు

తాండూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగేతర శక్తులు రాజ్యమేలుతున్నాయని కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అన్నారు. బుధవారం తాండూరులోని అంబేడ్కర్ చౌక్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ప్రైవేట్‌రంగం 85శాతానికి పెరిగిందని, అందులో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. ప్రైవేట్ రిజర్వేషన్లకు మహోద్యమం చేయాలన్నారు. జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్‌లు ఉన్నంత వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. యువత సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ఉపాధ్యక్షులు మహిపాల్, సురేష్, వివిధ సంఘాల నాయకులు రాజు, శ్రీనివాస్,బుగ్గప్ప,ఆనంద్‌కుమార్, గోపాల్, చంద్రయ్య, శ్రీనివాస్, బలరాం, రఘుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.



జన జాతర సభలో అభివాదం చేస్తున్న పసునూరి రవీందర్, సంఘాల నాయకులు

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనాథ, పేద మహిళా అభ్యర్థుల నుంచి పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమాధికారి శ్రీలత తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో పలు డిప్లొమా కోర్సులను అందిస్తున్న నేపథ్యంలో అర్హులైన అనాథ, పేద మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు చేసేందుకు 60సీట్లు ఉన్నాయని, వాటిల్లో అనాథలు, పాక్షిక అనాథలు, పేదలకు, ట్రాఫికింగ్‌కు గురైన అమ్మాయిలు, బాలికా సంరక్షణ కేంద్రంలోని అమ్మాయిల కోసం 70శాతం చొప్పున ఒక్కో కోర్సులో 42సీట్లు కేటాయించినట్లు వివరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ నియమం ప్రకారం మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణ పాలిసెట్ పరీక్ష రాయకపోయినా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెల 20లోపు కుల, ఆదాయ, గార్డియన్ డెత్, బోనాఫైడ్, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, టెన్త్ మెమోను జత చేసి అమీర్‌పేటలోని బాలరక్ష భవన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

ప్రధానోపాధ్యాయుడికి ఇండో గ్లోబల్ అవార్డు



తనికెళ్ల భరణి నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం షఫీ

దోమ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ.షఫీకి ఇండో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెస్టివల్-2025 అవార్డును అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో సినీ నటుడు తనికెళ్ల భరణి, గ్లోబల్ మీడియా నెట్‌వర్క్ ఎడిటర్ ఇన్ చీఫ్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి నవీన్ మిట్టల్, వివిధ విద్యా సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, దోమ ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయుడు వెంకటయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడి.. జింక మృత్యువాత

పూడూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో జింక మృతి చెందింది. ఈ సంఘటన పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో బుధవారం వెలుగులోకొచ్చింది. వివరాలిలా ఉన్నాయి. దామగుండం అడవిలో కుక్కలు ఓ జింకను కరిచి చంపాయి. గతంలోనూ జింకలను కుక్కలు చంపాయని, వన్యప్రాణులను రక్షించేందుకు అధికారులను చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



జింకపిల్ల కళేబరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విడతలవారీగా 20వేల ఇళ్లు నిర్మిస్తాం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):విడతల వారీగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. అర్హులను గుర్తించాలని ఇందిరమ్మ కమిటీలు, అధికారులకు సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతగా 3,500 మందికి ఇళ్లు కట్టిస్తామని, త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లు పేదలను పట్టించుకోలేదని, గూడు లేనివారు ఇబ్బందులు పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట సొంత స్థలం ఉండి ఇల్లులేని పేదలను గుర్తిస్తున్నామని, జాగలేని వారి విషయంలో త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ అబద్ధ ప్రచారాన్ని తిప్పికొటాలని కార్యకర్తలకు సూచించారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం వంటి ప్రజారంజక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



బసవేశ్వరుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే శంకర్, సంఘాల నాయకులు

కారణజన్ముడు.. బసవేశ్వరుడు

నందిగామ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడు కారణ జన్ముడని, ఆ రోజుల్లోనే ఆయన కులవివక్షను రూపుమాపేలా పాలించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామలో లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. బసవేశ్వరుడు సామజిక విప్లవకారుడని, కులవ్యవస్థను నిర్మూలించి, సమాజంలో అసమానతులను తొలగించిన మహనీయుడని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పి.రాములు, సి.నర్సింలు, బంట్రపు జంగయ్య, సుమన్, అంజూయాదవ్, కె.అంజయ్య, రవీందర్, కె.వెంకట్‌రెడ్డి, ఎం.యాదయ్యగౌడ్, రామస్వామిగౌడ్, సంఘ సభ్యులు బసవ లింగం, శేఖరప్ప, సతీష్, మహేష్, రవిశంకర్, శేఖర్, లింగం పాల్గొన్నారు.

మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని డీఆర్‌వో సంగీత. బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్‌రామ్ అన్నారు. బుధవారం బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు. వారు మట్లాడుతూ.. మూఢనమ్మకాలపై బసవేశ్వరుడు నిరంతరం పోరాటం చేశారన్నారు. ప్రథమ సంఘ సంస్కర్త, మానవతావాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో సునిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రిటైరవుతున్న అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తేనే సంతృప్తి

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే జీవితంలో ఎంతో సంతృప్తిని కలుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న షెడ్యూల్ కులాల అబివృద్ధి అధికారి మల్లేశం,యువజన సర్వీసులు, క్రీడల అధికారి హన్మంతరావు, యాలాల్ తహసీల్దార్ అంజయ్యలను ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే అదృష్టం అందరికీ రాదని, ఆ అదృష్టం ప్రభుత్వ ఉద్యోగులకు రావడం గొప్ప విషయం అన్నారు. నిబద్ధతతో పనిచేసి అధికారులు, ప్రజల మన్ననలు పొందడం తృప్తి కలిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తమ శేష జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యవసాయ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షాచౌదరి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్, డీబీసీడబ్ల్యూవో ఉపేందర్, డీఎండబ్ల్యూవో కమలాకర్ రెడ్డి, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి, దళిత సంఘాల నాయకులు, కుటుంబీకులు పాల్గొని శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.



ఏఎస్ఐ హాషంను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

స్ఫూర్తిదాయకంగా విధుల నిర్వహణ

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హాషం పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి ఏఎస్ఐగా ఎదిగి, అంకిత భావంతో సేవలందించారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం హాషం ఉద్యోగ విమరణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి మచ్చలేకుండా విధులు నిర్వహించడం సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. హాషం కుటుంబ సహకారం, త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రహదారికి తొలగిన అడ్డంకులు

▸▸ ఆటంకాలను క్లియర్ చేసిన హైడ్రా

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేవరయంజాల్, కండ్లకోయ ప్రాంత ప్రజలు సులభంగా జాతీయ రహదారి 44కు చేరుకునే అవకాశాన్ని హైడ్రా కల్పించింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారికి బండకుంట నరసింహారెడ్డి అనే వ్యక్తి గేట్లు పెట్టి, రోడ్డును కొంత తవ్వేసి ఆటంకాలు సృష్టించాడు. దీంతో గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో బుధవారం హైడ్రా వాటిని తొలగించింది. షామీర్‌పేట మండలం దేవరయంజాల్‌కు రోడ్డును హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా.. త్వరలో 40అడుగుల వెడల్పుతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించనున్నారు. రోడ్డుకు ఆటంకాలు సృష్టిస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి రాళ్లను తొలగించింది.

పదవుల పందేరం!

(మొదటి పేజీ తరువాయి)

మంది పేర్లు వినిపిస్తున్నప్పటికీ సీనియార్టీతో పాటు అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పగ్గాలు అప్పగించాలని అధినాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

2017 నిబంధనతో..

రంగారెడ్డి డీసీసీ రేసులో పార్టీ సీనియర్ నేతలు మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన దేప భాస్కర్‌రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, శంషాబాద్‌కు చెందిన రాచమళ్ల సిద్ధేశ్వర్, వేణుగౌడ్ తదితరలు పోటీలో ఉన్నారు. వికారాబాద్ డీసీసీ అధ్యక్ష రేసులో సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, లాల్ కృష్ణ ప్రసాద్, ధారాసింగ్, కిషన్ నాయక్ పోటీలో ఉండగా రఘువీరారెడ్డికి అధ్యక్ష పీఠం దక్కే అవకాశాలు మెండుగా ఉన్నట్లు సమాచారం. మేడ్చల్ డీసీసీ అధ్యక్ష రేసులో హరివర్ధన్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ పోటీ పడుతున్నారు. 2017 నిబంధన కూడా మరికొందరికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నిబంధనతో కొత్తగా పార్టీలో చేరిన వారి ఆశలు నెరవేరే పరిస్థితి లేదన్న చర్చ జరుగుతోంది. మొత్తంగా కాంగ్రెస్ పదవుల పంపకాల్లో ఎవరికి ఏ పదవి దక్కుతుందో అనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

సీనియర్లకే ప్రాధాన్యం

కాంగ్రెస్ ఈ సారి ఎన్నికల్లో కొత్త ట్విస్ట్ ఇచ్చింది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈసారి సంస్థగత ఎన్నికల్లో అధిష్ఠానం కొత్త మెలిక పెట్టింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పని చేస్తున్న వారికి పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలకు సూచించారు. ఈ విషయంలో కచ్చితంగా అమలు చేయాలని ఆమె నేతలకు స్పష్టంగా తెలిపారు. దీంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తవారు పార్టీలో చేరి పెత్తనం చెలాయిస్తున్నారని తామేమి చేయాలని మదనపడుతున్న సీనియర్లకు ఈ నిర్ణయం కొండంత అండగా నిలిచింది. మండల, బ్లాక్ గ్రామ కమిటీలలో సీనియర్‌లకు ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. కీలక పదవులు సీనియర్లకు దక్కే అవకాశం కూడ ఉంది. ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉండి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పదేళ్లు పార్టీ కోసం పని చేసిన నేతలకు పదవులు దక్కేలా చూడాలని ఇందుకు నాయకులు గుర్తించాలని కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగళ్ల కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం పౌర సరఫరాల శాఖ మంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయని, అంచాన మేరకు సరిపడా గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతీ రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుగుణబాయి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బతుకులు దుర్భరమే..

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

కొత్తూర్/ మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాత్రింబవళ్లు యంత్రాల మధ్య పనిచేస్తూ ప్రజలకు వినియోగ వస్తువులను తయారు చేస్తున్న కార్మికుల బతుకులు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జరుపుకుంటున్నా.. కార్మికులు మాత్రం కనీస వేతనాలు, సౌకర్యాలు, భద్రతకు నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలు చేస్తున్నా వాటిని పారిశ్రామిక వేత్తలు పాటించడం లేదు. చట్టాలను కాలరాస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

జిల్లాలో వెయ్యికిపైగా పరిశ్రమలు

రంగారెడ్డి జిల్లాలోని వెయ్యికిపైగా వివిధ పరిశ్రమలున్నాయి. 1976లో ప్రభుత్వం కొత్తూర్ సమీపంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. కొత్తూర్, తిమ్మాపూర్, కొడిచర్ల, పెంజర్ల, ఇన్ముల్‌నర్వ, నందిగామ మండలం రంగాపూర్, మేకగూడ, చేగూర్ గ్రామాల్లో పరిశ్రమలు విస్తరించాయి. అలాగే ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, బూర్గుల, కొందుర్గు మండలాల్లో, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లోనూ పరిశ్రమలు నెలకొల్పారు.

60వేల మంది కార్మికులు

జిల్లాలోని పరిశ్రమల్లో 60వేలకుపైగా మంది కార్మికులు పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. కొత్తూర్ పారిశ్రామికవాడలోనే 10వేల మంది కార్మికులున్నారు. రాష్ట్ర కార్మికులతో పాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. వీరిలో 30శాతం మందే పర్మనెంట్ కాగా, మిగతా వారంతా కాంట్రాక్ట్, క్యాజువల్ లేబర్‌గా ఉన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, చట్టప్రకారం వర్తించే ఇతర ప్రయోజనాలు వర్తించడం లేదు. భవన నిర్మాణ రంగ కార్మికులు మేస్త్రీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, వడ్రంగి, వెల్డర్, పెయింటర్ తదితర 54రకాల అసంఘటితరంగ కార్మికులు పనిచేస్తున్నారు. 1996లో ప్రభుత్వం నిర్మాణ, ఇతర రంగాల కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 11రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అయితే 60శాతం మందికి గుర్తింపు కార్డులు లేక ప్రయోజనం పొందడంలేదు.

చాలీచాలని వేతనాలు

స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులకు నిబంధనల ప్రకారం వేతనాలు అందడం లేదు. లేబర్ యాక్ట్ ప్రకారం 20మందికిపైగా కార్మికులు పనిచేసే పరిశ్రమలో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. అయితే యజమానులు కొందరికే సౌకర్యాలు వర్తింపజేస్తున్నారు. తక్కువ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, జీవన ప్రమాణ స్థాయిని బట్టి వేతనాలను నిర్ధారించాల్సి ఉంది.

గాలిలో దీపంలా కార్మికుల భద్రత..

కార్మికులకు పనిప్రదేశాల్లో భద్రత కరువైంది. హీట్ రెసిస్టెంట్ యాప్రాన్లు, గమ్‌షూ, హెల్మెట్లు, గ్లౌజులు, సెఫ్టీ బెల్టులు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారి కుటుంబాలకు నామమాత్ర పరిహారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అన్‌స్కిల్డ్ లేబర్‌తో తక్కువ వేతనంతో పని చేయిస్తున్నారు. కార్మికులకు ఇళ్లు, విశ్రాంతి గదులు లేవు. మహిళా కార్మికుల ఇబ్బందులు అనేకం. రాత్రి పూట విధులు ముగించుకొని వెళ్లే వారికి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం లేదు. యజమానులు పరిశ్రమల సమీపంలో రేకులగదులు నిర్మించి వదిలేస్తున్నారు.

కనీస వేతనాలు, వసతులు కల్పించాలి



కార్మిక చట్టాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్మికులకు కనీస వేతనాలు, మౌలిక వసతులు, విశ్రాంతి, కేఫ్‌టేరియా/క్యాంటీన్లు, మంచినీరు, అంబులెన్స్, ట్రాన్స్‌పోర్టు వసతులను కల్పించడం లేదు. మహిళలు మరింతగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. కార్మిక శాఖ అధికారులు తగిన చర్యలు తీసకోవాలి.

- జీస సాయిబాబ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు



కొత్తూర్: సేఫ్టీ పరికరాలు లేకుండా పనిచేస్తున్న కార్మికుడు

మే డేలు ఎన్నొచ్చినా...

▸▸ అదే శ్రమదోపిడీ!

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా కార్మిక శ్రమ దోపిడీ ఆగడం లేదు. మేడ్చల్ జిల్లాలోని వివిధ ఇండస్ట్రియల్ ఏరియాలకు కార్మికులు వస్తున్నారు. అయితే వారికి సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. జీడిమెట్ల, షాపూర్‌నగర్, మేడ్చల్, నాచారం, ఉప్పల్, మౌలాలీ వంటి కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్డు సమీప గోదాముల్లో వేలాది మంది పనిచేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సైతం వేలల్లో కార్మికులు పనిచేస్తున్నారు. చాలా మంది క్యాజువల్ లేబర్‌గానే ఉన్నారు. ఫార్మా, ఐరన్ వంటి ప్రమాదకర పరిశ్రమల్లో వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. లేబర్ కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్నారు. ప్రతీ కార్మికుడిపై కమీషన్ తీసుకుంటూ కాంట్రాక్టర్లు, పరిశ్రమల యాజమానులు శ్రమ దోపిడీ చేస్తున్నారు. 12గంటలు పనిచేయించుకుంటూ ఓటీ కూడా ఇవ్వడం లేదు. కాగా కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన సంఘాలు యాజమాన్యాలకు తొత్తుల్లా మారుతున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

కష్టానికి తగిన ప్రతిఫలం లేదు



రోజంతా పనిచేస్తున్నా సరిపడా వేతనం అందడం లేదు. 8గంటల పనికని పలిచి 12గంటలు పని చేయించుకుంటున్నారు. కనీస సౌకర్యాలు లేకుండా ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు చాకిరీ చేయిస్తున్నారు.

- నమ్ము సదా, మేడ్చల్ పారిశ్రామికవాడ

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గౌతాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించొచ్చని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పంచాయతీలో సీసీ కెమెరాలను ఎస్ఐ విఠల్‌రెడ్డితో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో మల్లికార్జునాలయం వద్ద ఓ బాలుడిని కిడ్నాప్ చేయగా, అలాగే ఇదే ప్రాంతంలో గొర్రెలును అపహరించగా సీసీ కెమెరాల ఫుటేజీలతో కేసులను ఛేదించామన్నారు. చౌరస్తాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో సంఘటనలపై త్వరగా వివరాలు సేకరించగలుగుతామన్నారు. దుకాణాల్లో, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, గ్రామపెద్ద రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, శకుంతల, పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ తదితరులున్నారు. అనంతరం డీఎస్పీ, ఎస్ఐ, రాంరెడ్డిలను గ్రామస్తులు సన్మానించారు.

ఔత్సాహికులను ప్రోత్సహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వ్యాపారం చేసేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్యాక్స్‌ల కంప్యూటరైజేషన్, నూతన పెట్రోల్ పంపులు, ఎల్పీజీ, మత్స్యసంఘాలు, డెయిరీ ఫాంలు, గోదాముల ఏర్పాటు తదితరాంశాలపై జిల్లా సహకార, బ్యాంకుల అధికారులతో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి సమీక్షించారు. లింగ్యానాయక్ మాట్లాడుతూ.. సహకార రంగ బలోపేతానికి నిరుద్యోగులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు చెప్పారు. కొత్తగా వ్యవసాయ సహకరా సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదన వచ్చాయని తెలిపారు. కొత్త పెట్రోల్ పంపుల మంజూరు, ఇప్పటికే ఉన్న పెట్రోల్ పంపుల మార్పడిపై దృష్టిసారించాలని తెలిపారు. జన ఔషధి కేంద్రాలు, కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కృషిచేయాలని సూచించారు. నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్, భారతీయ బీజ్ సహకార్ సమితి లిమిటెడ్‌లు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నాగార్జున, నాబార్డ్ డీడీఎం అఖిల్,సెంట్రల్ బ్యాంక్ సీఈవో సుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక, వ్యవసాయ అధికారులు సదానందం, పద్మావతి పాల్గొన్నారు.

కూచిపూడిలో బాలిక గిన్నిస్ రికార్డు



వరల్డ్ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న చైత్ర

చేవెళ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ గ్రామానికి చెందిన బాలిక చట్లపల్లి చైత్ర కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. మహేందర్-శ్వేతల కుమార్తె చైత్రకు హైదరాబాద్‌లోని నాట్య గురువు కోవిద కాంతారావు, సాయి కూచిపూడి నృత్యం నేర్పించారు. 24 డిసెంబర్ 2023న హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో చైత్ర తన నృత్యంతో శభాష్ అన్పించుకుంది. అప్పట్లో దీనిపై వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నెల 2న చైత్ర నృత్య ప్రదర్శన బాగుందని కితాబిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు. 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో చైత్రకు రికార్డు పత్రాన్ని అందజేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు రావడం తనకు సంతోషంగా ఉందని చైత్ర తెలిపింది.

'పది'లో 31వ స్థానం

(మొదటి పేజీ తరువాయి)

రాయగా 22,105 మంది బాలికలు పాసయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 86.18 నమోదు కాగా బాలికల ఉత్తీర్ణత 89.65 శాతం నమోదైంది.

18 స్కూళ్లలో అంతా పాస్

జిల్లాలోని 18 పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు నమోదయ్యాయి. రాజేంద్రనగర్ మండలం ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్(బాలికల), గండిపేటలోని టీజీ ఎంఐఎస్ రెసిడెన్షియల్, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపల్లి పల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదేవిధంగా 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కావడ్‌పల్లి, బాటసింగారం, అబ్దుల్లాపూర్‌మెట్, మజీద్‌పూర్, బండరావిరాల, చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల, ఇబ్రహీంపట్నంలోని ఎలిమినేడు, ఇబ్రహీంపట్నం ఉర్దు మీడియం, మంచాల మండలంలోని మంచాల బాలికల ఉన్నత పాఠశాల, చెన్నరెడ్డిగూడ, నందిగామ మండలంలోని మేకగూడ, తలకొండపల్లిలోని వెల్జాల్ గర్ల్స్, యాచారం మండలంలోని చిన్న తూండ్ల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు జరగనున్నాయి. ఇకపోతే ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. అదేవిధంగా రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15 వరకు అవకాశం కల్పించారు. అయితే, ఇందుకోసం ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

నాలుగు సంవత్సరాల నుంచి నమోదైన ఉత్తీర్ణత వివరాలు

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2022	47,157	42,460	90.04
2023	47702	41488	86.97
2024	50,811	46,245	91.01
2025	51,671	45,386	87.84

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వీరే..

మండలం	పాఠశాల పేరు	విద్యార్థి పేరు	మార్కులు	శాతం
రాజేంద్రనగర్	జడ్పీహెచ్‌ఎస్, గణేష్‌నగర్	పాపిశెట్టి కార్తీక్	584	97.33
శేరిలింగంపల్లి	జడ్పీహెచ్‌ఎస్, దర్గాహుస్సేన్	ఎ.ఎస్. సలిత తాజీన్	576	96.00
ఇబ్రహీంపట్నం	జడ్పీహెచ్‌ఎస్, నాగపల్లి	జాన విజ్ఞేష్	574	95.67
శంషాబాద్	జడ్పీహెచ్‌ఎస్, పెద్దషాపూర్	కొందొల్లు పూజ	574	95.67
ఇబ్రహీంపట్నం	జడ్పీహెచ్‌ఎస్, చర్లపటేల్‌గూడ	కాలె కీర్తి	567	94.50
బాలాపూర్	జడ్పీహెచ్‌ఎస్, మామిడిపల్లి	జునెర మహావీన్	567	94.50
మాడ్గుల	జడ్పీహెచ్‌ఎస్, ఇర్విన్	రాజమోని అశ్విని	565	94.17
మంచాల	జడ్పీహెచ్‌ఎస్, ఆరుట్ల	చెరుకు అఖిలేష్	564	94.00
అబ్దుల్లాపూర్‌మెట్	జడ్పీహెచ్‌ఎస్, మజీద్‌పూర్	మండలి కీర్తన	564	94.00
ఇబ్రహీంపట్నం	జడ్పీజీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం	కొర్ర కీర్తన	563	93.83
ఇబ్రహీంపట్నం	జడ్పీహెచ్‌ఎస్, రాపోల్	గంగిరెడ్డి శివారెడ్డి	562	93.67
ఇబ్రహీంపట్నం	జడ్పీజీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం	ఎండి జేబా	562	93.67
ఇబ్రహీంపట్నం	జడ్పీహెచ్‌ఎస్, రాపోల్	బండ సౌమ్య	561	93.50
మాడ్గుల	జడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్	మారమ్ సౌమ్యశ్రీ	560	93.33
మాడ్గుల	జడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్	సామల రమ్యశ్రీ	559	93.17
మాడ్గుల	జడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్	పాలకూర స్పందన	559	93.17
గండిపేట్	జడ్పీహెచ్‌ఎస్, నార్సింగి	కృష్ణ రాయ్	558	93.00
శంకర్‌పల్లి	జడ్పీహెచ్‌ఎస్, కొండకల్	కొడి హన్సిక	557	92.83
అబ్దుల్లాపూర్‌మెట్	జడ్పీహెచ్‌ఎస్, అంజాపూర్	బొడ్డుపల్లి నందిని	557	92.83


జర్పుల సింధు(578) సాంఘిక సంక్షేమ పాఠశాల, ఆమనగల్లు


ఆర్ సింధు (575) ఎస్సీ గురుకులం, కమ్మదనం


వి.శ్రీనివాస్(574) ఎస్సీ గురుకులం, కొందుర్గు


కె.హన్సిక (572) నల్లకంచె గురుకులం, ఇబ్రహీంపట్నం


ఎం.పల్లవి (572) ఎస్సీ గురుకులం, కమ్మదనం


ప్రవల్లిక (570) ఎస్సీ గురుకులం, కమ్మదనం


కె.అఖిల్, 571, గిరిజన సంక్షేమ గురుకులం, ఇబ్రహీంపట్నం


ఎన్. రితీష్‌రెడ్డి(568) మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం, కేశంపేట

ప్రైవేట్‌కు దీటుగా 'పది' ఫలితాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రికార్డు సృష్టించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాల్లో సత్తా చాటారు. ఆమనగల్లు మండలంలోని 4 ఉన్నత, కేజీబీవీ, 8 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 547 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 453 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 82.81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పాండు తెలిపారు. ఆమనగల్లు వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి 567 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచింది. బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌కు చెందిన వి.లహరి 561 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం, కృష్ణవేణి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆసిన్ 557 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాస్ సన్మానించి అభినందించారు.


ఆమనగల్లు : ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు : ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న మహమూద్

మహేశ్వరం మండల టాపర్‌గా శ్రీలక్ష్మి

మహేశ్వరం : మండల పరిధిలోని దేవేంద్ర విద్యాలయం పది ఫలితాల్లో సత్తా చాటింది. పాఠశాలలో చదువుతున్న వేముల శ్రీలక్ష్మి 600 మార్కులకుగాను 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా దేవేంద్ర విద్యాలయంలో 600 మార్కులకుగాను 577 మార్కులు సాధించి పాఠశాలలో ద్వితీయ స్థానం సంపాదించారు. సౌమ్య 562, అహేబా 554, తపస్విని 554 మార్కులు సాధించారు. పదవ తరగతి ఫలితాల్లో మహేశ్వరం మండలంలోనే మొదటి స్థానంలో దేవేంద్ర విద్యాలయం విద్యార్థులు ఫలితాలు సాధించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ విజయేందర్‌గౌడ్, కరస్పాండెంట్ శ్వేత తెలిపారు. ముఖ్యంగా అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాల పేరును మండలానికే కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పది ఫలితాల్లో మండల టాపర్ గా నిలిచిన శ్రీ లక్ష్మిని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. 600 మార్కులకు 585 మార్కులు సాధించి పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చిన శ్రీలక్ష్మిని అభినందిస్తున్నామన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థిని ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ మాదవీశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణితో పాటు ఇతర ఉపాధ్యాయులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.


మహేశ్వరం : వేముల శ్రీలక్ష్మి(585) దేవేంద్ర విద్యాలయం

శ్రీచైతన్య స్కూల్ హవా..

ఆదిభట్ల : టెన్త్ ఫలితాల్లో ఇబ్రహీంపట్నంలోని శ్రీచైతన్య స్కూల్ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ వెల్లడించారు. మొత్తం 57 మంది విద్యార్థులు పరీక్ష రాయగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 12 మంది విద్యార్థులు 550 మార్కులు, 61 శాతం విద్యార్థులు 500 పైబడిన మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎం సయ్యద్ ఖాసీం అలీ, జోనల్ కో-ఆర్డినేటర్ దొంతికుర్తి రమేష్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.


ఆదిభట్ల : విజయసంకేతం చూపుతున్న శ్రీచైతన్య విద్యార్థులు

ఘనంగా బసవేశ్వరుడి జయంత్యుత్సవాలు

మంచాల/షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/షాబాద్/చేవెళ్ల/శంకర్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి జయంత్యుత్సవాలను మంచాల మండల పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జయంతి ఉత్సవాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు కాంగ్రెస్ యువనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం మండలాధ్యక్షుడు కె.శేఖరప్ప, వివిధ పార్టీల నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, ఎడమ నరేందర్‌రెడ్డి, డా.భిక్షపతి, హరీష్, తదితరులు పాల్గొన్నారు. సమాజంలోని కుల, వర్ణ, లింగ బేధాలను వ్యతిరేకిస్తూ, ప్రజల్లో చైతన్యం తెచ్చి, లింగాయత్ ధర్మాన్ని స్థాపించిన గొప్ప అభ్యుదయవాది, సంఘ సంస్కర్త బసవేశ్వరుడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ వీరశైవ సమాజం అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి ఉత్సవం జరిగింది. పరిగి రోడ్డులోగల మల్లిఖార్జున కాలనీలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, మున్సిపల్ చైర్మన్ సునిత, వీరశైవ సమాజం నాయకులు విశ్వం, బస్వం, గంగాధర్, శ్రవణ్ కుమార్, ఆకుల వీరేష్, పట్నంశెట్టి సంతోష్‌కుమార్, టెలిఫోన్ శివకుమార్, వీరేశం, ఎల్ కిరణ్‌కుమార్, జంగం సమాజం నాయకులు కాశీనాథ్, మఠం రాచయ్య తదితరులున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ జగదీశ్వర్ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ బాబురావు, వీరశైవ లింగం సభ్యులు మహేష్, రవికుమార్ పాల్గొన్నారు. సమాజంలో కుల వ్యవస్థను వర్ణబేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి ఒక బసవేశ్వరుడని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని బసవేశ్వరుడికి నివాళులర్పించారు. వీరశైవలింగాయత్ పెద్దలు లింగప్ప, మల్లిఖార్జున్, సుదీర్, జ్యోతిరవికుమార్, నవీన్, ప్రదీప్, మల్లేష్, పర్వదేది, వీరేష్, రాజేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు. బసవేశ్వరుడి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని చేవెళ్ల మండల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, వీరశైవ లింగాయత్ సంఘం చేవెళ్ల మండల నాయకులు ప్రభులింగం, వీరేశం, సురేశ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని బసవేశ్వరుడి విగ్రహంకు పూలమాలతో నివాళులర్పించారు. వీరశైవలింగాయత్ సంఘం నాయకులున్నారు. సమసమాజ స్థాపనకు బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని శంకర్‌పల్లి మున్సిపల్ వీరశైవ సమాజ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, చంద్రశేఖర్, ఉమాకాంతం, ఓంప్రకాశ్, నాగులు, లింగం, వీరప్ప, బసప్ప, అరుణ్, తదితరులు ఉన్నారు.


మంచాల : బసవేశ్వరుడి జయంత్యుత్సవాల్లో కాంగ్రెస్ యువనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి తదితరులు


షాబాద్ : నివాళులర్పిస్తున్న కొండా విజయ్‌కుమార్ తదితరులు

పర్యాటక రంగం అభివృద్ధికి పెద్దపీట

ఆమనగల్లు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పురాతన ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో బుధవారం ఎంపీ, ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3లక్షల 10వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గుండాల అంబ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి సిలువేరు రామస్వామి గౌడ్ అలవేలు మంగ దంపతుల సహకారంతో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని మండల నాయకులు, ఆలయ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

మొయినాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 218లో రెండు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. షెడ్లు సైతం నిర్మించారు. బుధవారం రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన షెడ్లు, ఫెన్సింగ్ తొలగించారు. భూమిని స్వాధీనం చేసుకున్నారు. కూల్చివేతల్లో ఆర్ఐ రోజ, సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేయనున్నట్లు గౌతమ్‌కుమార్ తెలిపారు.

'రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న బీజేపీ'

కందుకూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం కాలరాయడానికి కుట్రలు పన్నిందని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని లేమూరు, రాచులూరు, బేగంపేటలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరికి స్వాతంత్ర్య ఫలితాలు అందేలా నిపుణులతో రచించిన రాజ్యాంగాన్ని అవమానపర్చడానికి బీజేపీ కుట్రలు పన్నిందన్నారు. దీనికి నిదర్శనం పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానపర్చేలా మాట్లాడమేనన్నారు. ఆయన అనుచితమైన వ్యాఖ్యలను సమర్థించడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తగదన్నారు. నాయకులు సురేందర్, పుష్పదర్శన్, అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, ఎండీ సులేమాన్, సరికొండ జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షయ తృతీయ

షాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : అక్షయ తృతీయను బుధవారం భూమి పుత్రులు (రైతులు) అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని లక్ష్మారావుగూడ, ఎర్రోనిగూడ, దైవాలగూడ, బొబ్బిలి గామ, లింగారెడ్డిగూడ, కొమరబండ, దేవునిగడ్డ, తాళ్లపల్లి, అంతిరెడ్డిగూడ, బోనగిరిపల్లి తదితర గ్రామాల్లో యోగేశ్వర కృషి భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతీ యువకులు ఆట పాటలతో అలరించారు. కృషి భూమిలో గ్రామ పూజారులు 31 మందిగా ఏర్పడి ప్రతిరోజు యోగేశ్వర కృషి భూమిలో పూజలు నిర్వహించే విధంగా నిర్ణయించుకున్నారు. అనంతరం కృషి భూమిలో రైతులు, మహిళలు నాగళ్లు, గుంటకలతో భూమిని చదును చేస్తూ విత్తనాలు నాటారు.


బొబ్బిలిగామలో పూజలు నిర్వహిస్తున్న గామస్తులు

స్వయం ఉపాధితో ఆర్థిక వృద్ధి : స్పీకర్

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి వైపు యువత మొగ్గు చూపి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హిమాయత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బుర్రకాయల రమేష్ ముదిరాజ్ చిలుకూరు రెవెన్యూ పరిధిలో నూతనంగా లాండ్రీ(డ్రైక్లీనింగ్) దుకాణాన్ని ఏర్పాటు చేయగా స్పీకర్ బుధవారం సాయంత్రం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పీకర్ తెలిపారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండలాధ్యక్షుడు మాణయ్య తదితరులు పాల్గొన్నారు.


షాపును ప్రారంభిస్తున్న స్పీకర్

సంక్షిప్తంగా..

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే కాంగ్రెస్ నేతలు ఉన్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన బాధ్యతారహిత్యానికి నిదర్శనమన్నారు.

కొత్తూర్ : ఎస్‌బీ పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ గ్రామంలో మంచినీటి సమస్యను తీర్చేందుకు రూ.2లక్షల సొంత ఖర్చులతో బోరు వేయించి ఉదారతను చాటుకున్నాడు. బీరప్ప ఉత్సవాలకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బోరు వేయించానని తెలిపారు.

కేశంపేట : సంగెంలో సీసీ రోడ్డును కబ్జా చేయడానికి యత్నించిన వ్యక్తిపై ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కందూరి మహేందర్ రోడ్డు వేయకుండా అడ్డుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కు పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి.. చికిత్స పొందుతూ యువకుడి మృతి

- స్నేహితుల మరణం జీర్ణించుకోలేక సూసైడ్!

కందుకూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్నేహితుల మరణం తట్టుకోలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లేమూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు కందుకూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని లేమూరుకు చెందిన గజాడి మల్లేష్, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శివకుమార్(22) చిన్న కుమారుడు గోపికృష్ణ బీటెక్ చదువుతున్నాడు. శివ కుమార్ గండిపేట మండల పరిధిలోని ఎంజీఐటీలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. టాటా కంపెనీలో ఏడాదికి రూ.12లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఎంజీఐటీలో విద్యాభ్యాసం చేసిన శివకుమార్ ముగ్గురు స్నేహితులు పది నెలల క్రితం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి దిగాలుగా ఉన్న శివకుమార్ అమెరికా వెళ్లడానికి రెండుసార్లు వీసా కోసం ప్రయత్నించాడు. అయితే, వీసా రాకపోవడం, ముగ్గురు స్నేహితులు మృతి చెందడం జీర్ణించుకోలేక వారం రోజుల క్రితం కలుపు మందు(క్రిమిసంహారక మందు) తాగాడు. నగరశివారులోని యశోద(మలక్‌పేట) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించిన తల్లిదండ్రులు పెద్దకుమారుడు ఇలా మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. శివకుమార్ మృతిచెందడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగిలించి డబ్బులు ట్రాన్స్‌ఫర్

- వ్యక్తి అరెస్టు.. ఐదు ఫోన్లు, ఆటో స్వాధీనం
- పరారీలో మరో ముగ్గురు

కడ్తాల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి సునాయాసంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాల్పడుతున్న దొంగను కడ్తాల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చోరీకి సహకరించిన మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్‌కు చెందిన ఆటోడ్రైవర్ మేకల కల్యాణ్ ఏప్రిల్ 9న కడ్తాల బస్టాండ్ వద్ద బస్సులో ఎక్కే వ్యక్తి దగ్గర తన అనుచరులు ఆవుల శ్రీను, వెంకటరమణమ్మ, రాకేశ్‌లతో కలిసి సెల్‌ఫోన్ దొంగిలించాడు. దొంగిలించిన ఫోన్‌పే లాక్ తెలుసుకొని అకౌంట్‌లో ఉన్న రూ.82,600 వేరే అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసి వెళ్లిపోయాడు. ఏప్రిల్ 11న జరిగిన విషయాన్ని కడ్తాలకు చెందిన బాధితుడు జురిగ సింహయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం ఆటోలో మళ్లీ దొంగతనం చేసేందుకు మైసిగండికి రాగా.. పోలీసు సిబ్బంది రామకోటి, రాజశేఖర్‌తో కలిసి పట్టుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అతడి నుంచి 5 సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మేకల కల్యాణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కల్యాణ్ గతంలో కూడా ఉప్పల్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి అరెస్టైనట్లు తెలిపారు. ఏపీలోని కడప జిల్లా కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి సేవించి అరెస్టయినట్లు సీఐ తెలిపారు. చోరీకి సహకరించిన ఆవుల శ్రీను, వెంకటరమణమ్మ, రాకేశ్‌లు పరారీలో ఉన్నారు.


నిందితుడు కల్యాణ్

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఒకరు మృతి

ఆదిభట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలైన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్‌పై బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. విజయవాడకు చెందిన సచిన్‌వ్యాస్(47), కారు డ్రైవర్ కటారి సుల్మోన్‌రాజు(27)లు మంగళవారం రాత్రి విజయవాడ నుంచి రాయచూరుకు బయలుదేరారు. బుధవారం ఉదయం 4.30 గంటలకు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 12 వద్ద బొంగ్లూర్ సమీపంలో సుల్మోన్‌రాజు అతివేగంగా నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో సుల్మోన్‌రాజుకు తీవ్రగాయాలు కాగా పక్కన ఉన్న సచిన్‌వ్యాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఓఆర్ఆర్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డ్యూటీలో ఉన్న డాక్టర్ పరిశీలించి డ్రైవర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సచిన్‌వ్యాస్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సచిన్‌వ్యాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ఆదిభట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం, తుర్కయంజాల్‌కు చెందిన మధుసూధన్‌రెడ్డి(74) బుధవారం మన్నెగూడ సమీపంలోని బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి బీఎన్‌రెడ్డి నగర్ వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మధుసూధన్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో... ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హోంగార్డు మృతి కేసులో నిందితుల రిమాండ్

యాచారం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హోంగార్డు మృతికి కారకులైన ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మధు తెలిపారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గున్‌గల్‌కు చెందిన హోంగార్డు వెంకటేష్‌పై గత సోమవారం దాడి చేయడంతో అతను హైటెన్షన్‌కు గురవ్వడంతో మరణించాడని, అతడి మరణానికి కారకులైన పవన్, ప్రశాంత్, యాదమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వదినపై దాడి కేసులో మరిది..

యాచారం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వదినపై దాడి చేసి గాయపరిచిన మరిదిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తేజంరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం మంగలిగడ్డతండాకు చెందిన ఎన్.శాంతి తన ఇంటి బయట రొట్టెలు చేస్తోంది. ఈక్రమంలో గంజిని బయట పారబోయగా పొరపాటున ఆమె యారాలు శారదపై పడింది. దాంతో ఆగ్రహంతో శారద భర్త చందర్ తన వదినపై బండరాయితో దాడి చేయగా ఆమె పళ్లు ఊడిపోయాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు చందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితులపై 'పోక్సో'

కొత్తూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఓ బాలికపై లైంగికదాడికి యత్నించిన బీర్ల రమేష్, గోదా కృష్ణయ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. రెండు రోజులక్రితం రమేశ్, కృష్ణయ్య మద్యం సేవించి ఇంట్లోకి వెళ్లి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దాంతో వారి నుంచి బాలిక తప్పించుకొని పక్క ఇంట్లోకి వెళ్లడంతో నిందితులు పరారయ్యారు. బాలిక పెదనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం ప్రత్యేక టీంతో గాలింపులు జరిపి మంగళవారం పట్టుకున్నారు.